## క్లుప్తంగా

### తుప్పలతో తిప్పలే!



ప్రమాదభరితంగా ఉన్న కాండ్రకోట రోడ్డు

సామర్లకోట: పెద్దాపురం నుంచి కాండ్రకోట వెళ్లే రహదారి ప్రమాదబరితంగా ఉంది. ఈ రోడ్డు వంకరలతో ఉండటంతో పాటు రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడం వల్ల ఎదుటి వాహనాల రాక తెలిసే అవకాశం లేకుండా పోతోంది. కాండ్రకోట నూకాలమ్మ ఆలయంలో జాతర ఉత్సవాలు, తిరునాళ్లు జరుగుతున్నాయి. కాండ్రకోటలోని నూకాలమ్మ అమ్మవారు ఎంతో మహిమ కలిగిన అమ్మ వారిగా ప్రసిద్ధి. దాంతో అనేక గ్రామాలకు చెందిన వారు ఈ రోడ్డు మీదుగా కాండ్రకోటకు వచ్చి వెళ్తుంటారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఉపాధి హామీ పథకంలో తుప్పలను తొలగించి, ప్రమాద సూచికలను ఏర్పాటు చేసి ప్రమాదాల బారి నుంచి రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

### గోపిశర్మ సిద్ధాంతి బృందానికి పురస్కారాలు



అవార్డులు అందుకున్న గోపిశర్మ

సామర్లకోట: పెద్దాపురానికి చెందిన వాస్తు సిద్ధాంతి చింతా గోపిశర్మకు వారి శిష్యబృందం సూర్యచంద్ర కల్చరల్ అండ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పలు అవార్డులను అందుకున్నారు. సోమవారం రాత్రి భారత వికాస్ పరిషత్తు చారిటబల్ ట్రస్టు, కూకట్‌పల్లి, హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా వాస్తు బ్రహ్మ, వారి శిష్యులు చాడ హనుమశాస్త్రికి జ్యోతిష భూషణ్, ముక్కు సుబ్రహ్మణ్యానికి జ్యోతిష భూషణ్, భాగవతుల భవానీశర్మకు భారతీయవాస్తు సుధాకర, కవితా ఫణిశర్మకు జ్యోతిష ప్రవీణ, కామవరపు విజయమారుతి శర్మకు జ్యోతిష కేసరి, శర్మధకు జ్యోతిష ప్రవీణ అవార్డులు అందజేశారు.

### పైప్‌లైన్ లీకుతో నీరు వృథా



సామర్లకోట-కాకినాడ రోడ్డులో ప్రధాన పైప్‌లైను లీకేజీతో ఏర్పడిన గుంటలు

సామర్లకోట: పెద్దాపురం పట్టణ ప్రజలకు తాగునీరు సరఫరా అయ్యే ప్రధాన పైప్‌లైను లీకు అవుతూ తాగు నీరువృథాపోతోంది. దీని వల్ల రోడ్డు గోతులు పడిపోతోంది. సామర్లకోట-కాకినాడ రోడ్డులోని సాంబమూర్తి రిజర్వాయర్ నుంచి పైప్‌లైను ద్వారా పెద్దాపురం ట్యాంకులకు నీరు సరఫరా అవుతోంది. అయితే ఈ పైప్‌లైన్ లీకు కావడంతో తాగునీరు వృథా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారుల సత్వరం స్పందించి సత్వర చర్యలు తీసుకోవాలి.

### నేటి నుంచి జాతర



జి.మేడపాడులోని మహాలక్ష్మి అమ్మవారు

సామర్లకోట: మండల పరిధిలో జి.మేడపాడు గ్రామంలో వేంచేసి ఉన్న మహాలక్ష్మి, పోలమ్మ అమ్మవార్ల జాతర బుధవారం నుంచి మూడు రోజులు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త మోరంపూడి శ్రీరంగనాయకులు తెలిపారు. వైశాఖ మాసం షష్ఠిని పురస్కరించుకుని ఏటా ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. దీనిలో భాగంగా బుధవారం సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో జాతర నిర్వహిస్తామన్నారు. గురువారం నుంచి అమ్మవార్లను భక్తులు దర్శించుకుంటారని చెప్పారు. ఉత్సవాల ముగింపు రోజున అన్నదానం చేయనున్నట్టు తెలిపారు.

### ఎన్టీఆర్‌కు నివాళి

సామర్లకోట: పెద్దాపురంలో ఎన్టీఆర్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పెరిగిన వేతనం ఉపాధికి ఊతం

- రోజువారీ కూలి రూ.300 పెంపు
- గ్రామాల్లో ముమ్మరంగా పనులు
- పెరుగుతున్న మౌలిక వసతులు



కొమరగిరిలో సాగుతున్న ఉపాధి పనులు



ఉపాధి పనిలో మస్తర్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకట నారాయణ

కొత్తపల్లి: వలసల నివారణతో పాటు గ్రామీణుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు ఉపాధి హామీ పథకం ఎంతగానో తోడ్పడుతోంది. ఈ పథకం కింద చెల్లించే వేతనం రూ.300 పెంపుతో కూలీలకు మరింత మేలు చేకురుతోంది. గ్రామాల్లో గతంలో కంటే మిన్నగా ప్రజలు ఈ పథకాన్ని వినియోగించుకుంటున్నారు. మండంలో 17,938 మందికి పైగా ఈ పనుల్లో పాల్గొంటున్నట్లు అధికారులు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

**రోజువారీ వేతనం రూ.300**

రోజువారీ రూ.250 ఉండే ఉపాధి వేతనాన్ని రూ.300 వరకు పెంచారు. దీంతో చేసిన పనిని బట్టి వేతనం చెల్లింపులు జరుగుతాయి. పెరిగిన వేతనంతో ఉపాధి కూలీల్లో సంతోషం కనిపిస్తోంది. గతంలో కంటే ఇప్పుడు పనులకు వచ్చే వారి సంఖ్య కూడా పెరిగింది.

**మండలంలో ఉపాధి కూలీల వివరాలు..**

| పని వివరం | సంఖ్య |
|---|---|
| మొత్తం జాబ్ కార్డులు | 16847 |
| మొత్తం కూలీలు | 25866 |
| పనిచేసే కూలీల జాబ్ కార్డులు | 12213 |
| పనిచేసే కూలీలు | 17938 |

**గ్రామాల్లో అభివృద్ధి**

ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు తమ గ్రామంలోనే పని దొరకడంతో పాటు ఆయా గ్రామాల్లో అభివద్ధి సైతం మెరుగవుతోంది. చెరువుల్లో పూడిక తీత, పంట కాలువల్లో పూడిక, శ్మశానాలు, ప్రభుత్వ కార్యాలయం ప్రాంగణాల్లో పనులు తదితర అంశాల్లో అభివృద్ధి కనిపిస్తోంది. రైతుల పంట పొలాలకు నీటి ఎద్దటి లేకుండా ఎంతో మేలు కలిగిస్తోంది.

**అభివృద్ధే లక్ష్యంగా పనులు**



ఉపాధి కూలీలకు ఆయా గ్రామాల్లో పనులు కల్పించడంతో పాటు చేసే పనులు గ్రామానికి, ప్రజలకు ఉపయోగపడేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. అమృత్‌సరోవర్ పేరుతో గత ఏడాది రెండు చెరువులు అభివృద్ధి చేశారు. ఈ ఏడాది మరో 5 చెరువులు ఎంపిక చేశాం. వీటిని త్వరలోనే అభివృద్ధి చేస్తాం. పంటపొలాలకు వెళ్లే డొంకరోడ్డును సైతం అభివద్ధి చేస్తున్నాం. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 4.05 లక్షల పని దినాలే లక్ష్యమన్నారు. ఇప్పటికే సుమారు 1.4 లక్షల పనిదినాలు కల్పించామన్నారు. పని కావాలన్న ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తున్నాం. రోజుకు సుమారు 4800 మంది కూలీలకు పని కల్పిస్తున్నాం.

– బి.రాజబాబు, ఉపాధి హామీ ఏపీఓ, కొత్తపల్లి

**చాలా ఉపయోగంగా ఉంది..**



ఉపాధి పథకం మాలాంటి పేదలకు ఎంతో ఉపయోగపడుతోంది. గతం కంటే ఇప్పుడు వేతనం సైతం పెరగడంతో ఎంతో సంతోషంగా ఉంది. మా గ్రామంలోనే మాకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు.

– తాతారావు, శ్రీరాంపురం

## నియోజకవర్గంలో నాకాబందీ

- రికార్డులు లేని వాహనాలు పోలీసు స్టేషన్‌కు తరలింపు



సామర్లకోటలో వాహనాలను తనిఖీ చేస్తున్న డీఎస్పీ లతాకుమారి, ఎస్సై మౌనిక

సామర్లకోట: నియోజకవర్గ పరిధిలో అన్ని గ్రామాలలోని ముఖ్య కూడళ్లలో మంగళవారం నాకాబందీ నిర్వహించారు. ఎన్నికల కౌంటింగ్‌ను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గం అంతా ఒకేసారి ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. రికార్డులు లేని వాహనాలను ఆయా పోలీసు స్టేషన్లకు తరలించారు. సామర్లకోట సీబీఎం సెంటర్‌లో డీఎస్పీ కె.లతాకుమారి ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. వాహన చోదకుల వద్ద తప్పని సరిగా రికార్డులు ఉండాలని ఆమె పేర్కొన్నారు. సెల్ ఫోన్‌లో రికార్డులు చూపినా సరిపోతుందని చెప్పారు. ఎటువంటి రికార్డులు, గుర్తింపు కార్డులు చూపకపోతే పోలీసు స్టేషన్‌కు వాహనాలను తరలిస్తామని, పోలీసు స్టేషన్‌లో వాహన చోదకులు రికార్డులను చూపించి వాటిని తీసుకు వెళ్లవచ్చని పేర్కొన్నారు. సామర్లకోటలో రైల్వే స్టేషన్ సెంటర్, పోలీసు రింగ్ సెంటర్, గాంధీ చౌక్, బళ్ల మార్కెట్, బ్రౌన్‌పేట, సీబీఎం సెంటర్, ప్రసన్నాంజనేయస్వామి టెంపుల్, మెహర్ కాంప్లెక్స్, మఠం సెంటర్‌లలో వాహనాలను తనిఖీ చేశారు. అదే విధంగా పెద్దాపురం పట్టణ పరిధిలో మున్సిపల్ సెంటర్, సంతమార్కెట్ సెంటర్, మరిడమ్మ టెంపుల్, కాండ్రకోట రోడ్డు జంక్షన్, గుర్రాల సెంటర్లలో, ఆయా గ్రామాల కూడళ్లలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమాల్లో పెద్దాపురం పోలీసు సబ్ డివిజన్ పరిధిలో సీఐలు, ఎస్సైలు, ఏఎస్సైలు, హెచ్‌సీలు, కానిస్టేబుళ్లు, హోమ్‌గార్డులు పాల్గొన్నారు.

## మట్టి తవ్వకాలు చూడరూ..



గోర్స చెరువులో సాగుతున్న మట్టి తవ్వకాలు

కొత్తపల్లి: మండలంలోని గోర్స చెరువులో మట్టి తవ్వకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. తవ్విన మట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంది. అయితే ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

**మట్టి తవ్వితే కఠిన చర్యలు**

మట్టి తవ్వకాలు నిలిపివేయాలని గ్రామ రెవెన్యూ అధికారికి ఆదేశాలు జారీ చేశాం. గ్రామాల్లో ఉన్న చెరువులు, పంట పొలాల్లో మట్టి తవ్వకాలపై అనుమతులు తప్పనిసరిగా పొందాలి. అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటాం. – సుందర్ రాజు, తహసీల్దార్

## స్ట్రాంగ్‌రూమ్ వద్ద మూడంచెల భద్రత



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో సీతారామారావు

సామర్లకోట: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కాకినాడ జేఎన్‌టీయూలో మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్టు పెద్దాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి, ఎన్నికల రిటర్నింగ్ అధికారిత జె.సీతారామారావు అన్నారు. మంగళవారం సాయంత్రం ఆర్డీఓ కార్యాలయంలో అసెంబ్లీ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న అభ్యర్థులు వారి తరఫున ఎజెంట్లకు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్‌లో ఈవీఎంల భద్రతపై ఎటువంటి అపోహలకు తావు లేదన్నారు. స్ట్రాంగ్ రూముల చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సీసీ కెమెరాల్లో నమోదు అయిన రికార్డులను 2వ అంతస్తులో అభ్యర్థులు ఏ సమయంలో నైనా చూడవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం, సామర్లకోట తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్యం



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ తులసి

గొల్లప్రోలు: ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని చేబ్రోలు పీహెచ్‌సీ డాక్టర్ తులసి అన్నారు. మండలంలోని ఎ.విజయనగరం గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ఇంటివద్ద మంచాన పడ్డ రోగుల వద్దకు వెళ్లి వారికి కావల్సిన వైద్యసేవలను అందజేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించి పౌష్టికాహారం తీసుకోవాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

### మహిళలు ఆరోగ్యంగా ఉండాలి

బోట్‌క్లబ్: మహిళ ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అద్దాల సత్యనారాయణ అన్నారు. స్థానిక నాగమల్లి తోట వద్ద ఉన్న సత్య దంత వైద్యశాలలో మంగళవారం ప్రపంచ రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవం , అంతర్జాతీయ మహిళల ఆరోగ్య సంరక్షణ దినోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలకు పద్మావతి దీప ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేసి వారి ఆరోగ్య సంరక్షణకు అవగాహన కల్పించారు. పద్మావతి మాట్లాడుతూ స్త్రీలందరికీ రుతుక్రమ పరిశుభ్రత చాలా ముఖ్యమైనదన్నారు. రుతు పరిశుభ్రత సరిగా లేకపోవడంతో, వారు అనేక తీవ్రమైన అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాగేంద్ర, చైతన్య పాల్గొన్నారు.

### మెగా రిటైల్ ఎక్స్‌పోకు విశేష స్పందన



రుణ మంజూరు పత్రాలు అందిస్తున్న యూనియన్ బ్యాంకు అధికారులు

బోట్‌క్లబ్: యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో స్థానిక కృషి భవన్‌లో మంగళవారం నిర్వహించిన మెగా రిటైల్ ఎక్స్‌పోకు విశేష స్పందన లభించింది. ఈ ఎక్స్‌పోను బ్యాంక్ జోన్ హెడ్ శంకరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు అనుగుణంగా బ్యాంక్ సేవలందిస్తుందని, వీటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రీజనల్ హెడ్ సాయి మనోహర్ మాట్లాడుతూ బ్యాంకు అతి తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తుందన్నారు. అనంతరం రుణాలు మంజూరుచేసిన వారికి రుణమంజూరు పత్రాలు అందించారు. బ్యాంక్ డిప్యూటీ రీజినల్ హెడ్ నారాయణ, జరీనా, ప్రముఖ వ్యాపారవేత్తలు, బిల్డర్లు తదితరులు పాల్గొన్నారు.

## రక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు



వాటర్ ట్యాంకు క్లీనింగ్ రికార్డును పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్

కోటనందూరు: ప్రజలకు రక్షిత తాగునీటిని సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టామని పంచాయతీ విస్తరణాధికారి జి.అరుణ్‌కుమార్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా ఓహెచ్‌ఎస్‌ఆర్, జీఎస్‌ఎల్ఆర్ ట్యాంకులను మంగళవారం శుభ్రపరిచారు. బిళ్లనందూరు, ఇండుగపల్లి, టీజేనగరం, ఎస్సార్‌పేట గ్రామాల్లో జరిగిన ట్యాంకుల క్లీనింగ్ పనులను ఈఓపీఆర్డీ పరిశీలించారు. రెండు రోజులకోసారి పరీక్షించిన తరువాతే నీటిని విడుదల చేయాలని సిబ్బందిని ఆదేశించారు. నిబంధనల మేరకు ట్యాంకులను శుభ్రపరచాలన్నారు. మంచినీటి సరఫరా వ్యవస్థలో లీకులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### ఒకటిన హనుమజ్జయంతి

బోట్‌క్లబ్: స్థానిక రిజర్వులైన్ అయ్యప్పస్వామి ఆలయంలో హనుమజ్జయంతి సందర్భంగా జూలై 1న ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఏడు గంటలకు పంచామృతాభిషేకం, నూతన వస్త్రాలంకరణ, పంచ మాలతో అలంకరణ, తమలపాకుల పూజ జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటలకు సామూహిక హనుమాన్‌పూజ, సాయంత్రం 6 గంటలకు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించనున్నామని, భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలన్నారు.

## విద్యుత్ కనెక్షన్ల తొలగింపుపై ఆగ్రహం

కోటనందూరు: ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్ కనెక్షన్లు తొలగించడంపై అల్లిపూడి ఎస్సీ కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం అల్లిపూడి ఎస్సీ కాలనీలో పర్యటించిన విద్యుత్ శాఖ సిబ్బంది రూ.10 వేలు విద్యుత్ బకాయి ఉన్న విద్యుత్ కనెక్షన్లను తొలగించారు. బిల్లులు చెల్లిస్తే తిరిగి పునరుద్ధరిస్తామని స్పష్టం చేశారు. 200 యూనిట్ల వరకూ రాయితీ ఉన్న నేపథ్యంలో గత 17 ఏళ్లుగా విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదన్నారు. ఒకవేళ బకాయిలుంటే ముందస్తు సమాచారమిచ్చి కనెక్షన్లు తొలగించాలి తప్ప అర్ధాంతరంగా ఎలా తీసేస్తారని ప్రశ్నించారు.

## చిన్నారులకు తలసేమియా ఆరోగ్య పరీక్షలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ వీణ అక్కినేని

కాకినాడ సిటీ: అంతర్జాతీయ తలసేమియా దినోత్సవాన్ని పురస్కరించుకొని కాకినాడ రెడ్‌క్రాస్ తలసేమియా కేంద్రంలో మంగళవారం విజయవాడ రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ వైద్య బృందం సహకారంతో ఆ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తలసేమియా బాధిత చిన్నారులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. చిన్న పిల్లల వైద్య నిపుణులు, కన్సల్టెంట్ పిడియాట్రిక్ హెమటో ఆంకాలజిస్ట్ వైద్యులు వీణ అక్కినేని పాల్గొని మాట్లాడారు. దేశంలో తలసేమియా కేసులు పెరగటానికి ముఖ్యకారణం ప్రజల్లో వ్యాధి పట్ల సరైన అవగాహన లేకపోవడమే అన్నారు. 6 నెలల నుంచి 18 ఏళ్ల లోపు పిల్లలు రక్తహీనతతో బాధపడుతూ ఉంటే వైద్యుల సలహా మేరకు తలసేమియా, హిమోఫీలియా వంటి స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ వైడీ రామారావు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ తలసేమియా కేంద్రం 2017లో ప్రారంభించామని అప్పటి నుంచి నిరంతరంగా పిల్లలకు ఉచితంగా రక్తాన్ని ఎక్కిస్తూ, ఉచితంగా మందులు, ఆహారం, రవాణా ఖర్చులు కూడా అందిస్తూ వారిపై మరింత భారాన్ని తగ్గించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి కె.శివకుమార్, వైద్యులు పి.దుర్గరాజు, వి.రామకృష్ణ, పరాశర తదితరులు పాల్గొన్నారు.

## భగ్గుమన్న భానుడు



నిర్మానుష్యంగా ఉన్న కాకినాడ-యానాం ప్రధాన రహదారి

- ఒక్కసారిగా పెరిగిన ఉష్ణోగ్రతలు
- మంగళవారం 40 డిగ్రీల నమోదు

కాకినాడ సిటీ: జిల్లాలో ఎండలు మండుతున్నాయి. అల్పపీడనం, తుపాను ప్రభావంతో కొద్ది రోజులుగా ఎండ తీవ్రత తక్కువగానే ఉన్నా, సోమవారం నుంచి తీవ్రత పెరిగింది. రోహిణీ కార్తె ప్రారంభం కావడంతో భానుడి భగభగలు మరింత పెరుగుతాయని ఆందోళన చెందుతున్నారు. మధ్యాహ్నం 11 గంటల నుంచే వడగాల్పులు వీస్తున్నాయి. కాకినాడలో మంగళవారం 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కాకినాడలోని ప్రధాన రహదారి, కాకినాడ-యానాం, కాకినాడ-పిఠాపురం, కాకినాడ-రామచంద్రపురం ప్రధాన రోడ్లు, ఇతర ప్రధాన సెంటర్లు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్మానుష్యంగా తయారయ్యాయి. ప్రారంభంలోనే ఎండల తీవ్రత అంతగా లేక అంతంత మాత్రంగా సాగినా ఏసీలు, ఎయిర్ కూలర్లు, ఫ్రిజ్‌ల విక్రయాలు గత నాలుగు రోజులుగా గణనీయంగా పెరుగుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. జూన్ మొదటి వారం వరకు ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన సంగతి తెలిసిందే.

**జీవనోపాధిపై ప్రభావం**

ఉష్ణోగ్రతలు పెరగడంతో చిరువ్యాపారుల జీవనోపాధిపై ప్రభావం పడుతోంది. తినుబండారాలు, రోడ్డు పక్కనే ఇతరత్రా వ్యాపారాలు సాగించే చిరు వ్యాపారులు ఎండ తీవ్రతకు వ్యాపారాలు చేయలేక పోతున్నారు. నిత్యం రద్దీగా ఉండే పలు కూడళ్లు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. వడగాల్పుల నేపథ్యంలో కనీస జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

### అడవి బిడ్డలకు సైన్సు ఆటలు



శిబిరంలో పాల్గొన్న గిరిజన విద్యార్థులు

సామర్లకోట: పెద్దాపురం ఏ సిటీ సైన్ సెంటర్ నిర్వాహకులు అడవి బిడ్డలకు సైన్సు పాఠ్యాంశాలను ఆటలతో నేర్పించారు. ఈ మేరకు నిర్వాహకులు బుద్దా శ్రీనివాసు మంగళవారం వివరాలను విలేకర్లకు తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు వ్యాలీలో శారదా విద్యానికేతన్ గిరిజన పాఠశాలలో పదో తరగతి, ఇంటర్, డిప్లమా, ఇంజినీరింగ్ విద్యార్థులకు ఫన్ సైన్సు వర్కుషాపును సోమ, మంగళవారం నిర్వహించామన్నారు. సైన్సును చదువుతూ నేర్చుకోకుండా, చూస్తూ నేర్చుకోవడం వలన విద్యార్థులు విజ్ఞానరంగంలో ఉన్నత శిఖరాలకు చేరవచ్చునని ఆయన తెలిపారు. ఆమ్లాలు, క్షారాలు, గరిమ నాబి, ఘర్షణ, న్యూటన్ మూడో గమన విషయం, ధ్వని, కాంతి, మంటలతో ప్రయోగాలు వంటి ప్రయోగాలను గిరిజన విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వివరించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం చిల్డ్రన్ క్లబ్ ఇన్‌చార్జిలు రమాప్రభ, క్రాంతికుమార్, శ్యామ్, గిరిజన పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారని తెలిపారు.

### అపర్ణాదేవికి ఆమ్రఫలాలంకరణ



ప్రత్యేక అలంకరణలో అపర్ణాదేవి అమ్మవారు

గొల్లప్రోలు: వైశాఖ మాస బహుళ పంచమిని పురస్కరించుకుని మంగళవారం తాటిపర్తి అపర్ణాదేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రభాకరశాస్త్రి, అమ్మవారిని మామిడిపండ్లు, పుష్పమాలలతో అలంకరించారు. ఈ సందర్భంగా సహస్ర నామ కుంకుమార్చన, అష్టోత్తర శతనామ కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### ఉపాధి ప్రాంతాల్లో కనీస వసతులు కల్పించాలి



ఉపాధి కూలీలను ఉద్దేశించి మాట్లాడుతున్న సుబ్బారావు

కరప: వేసవిలో ఉపాధికూలీలకు టెంట్, తాగునీటి వసతి, మెడికల్ కిట్లు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. మండలం వాకాడలో మంగళవారం ఆయన పర్యటించి, అక్కడ జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని జరిగే ప్రదేశంలో కూలీలకు వసతులు కల్పించాలని, ఎవరైన మరణిస్తే రూ.5 లక్షల బీమా ఇవ్వాలని సుబ్బారావు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.ఈశ్వరరావు, కేఎస్ శ్రీనివాస్, మండలశాఖ నాయకులు చోడిశెట్టి కృష్ణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.